

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

నేలతల్లి ఒడిలో విత్తిన విత్తు ఆరోగ్యంగా ఎదిగి అధిక ఫలసాయం రావాలంటే భూమిలో సారం పెంచడంలో పచ్చిరొట్ట పైర్లు ఎంతో కీలక ప్రాత పోషిస్తాయి. -10లో



జల్సాల కోసం దొంగతనం

జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ఆగి ఉన్న లారీల నుంచి డీజిల్, పెట్రోల్ దొంగతనం చేస్తూ ముగ్గురు యువకులు పోలీసులకు చిక్కారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4/24.6

జిల్లాలో బుధవారం 24.6 - 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు బదిలీ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో మినిమం టైమ్ స్కేల్‌పై పనిచేస్తున్న డీఎస్సీ 2008, 1998 సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు 20వ తేదీ బదిలీ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. కడప డీఈఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల జాబితా జిల్లా విద్యాశాఖాధికారి అంతర్జాలం www.kadapadeo.in లో ఉంచినట్లు తెలిపారు.

నేడు 'పాత్రికేయులకు యోగా శిక్షణ'

కడప సెవెన్‌రోడ్స్: కడపలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఈ నెల 19వ తేదీన ప్రత్యేకించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు,వారి కుటుంబ సభ్యులకు యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు సంబంధించిన జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



గండి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆలయంలోని ఏడు శాశ్వత హుండీల ద్వారా రు.20,81,450లు ఆదాయం వచ్చిందని తెలిపారు. అలాగే మిక్స్‌డ్ బంగారు వస్తువులు 000.005.000 గ్రాములు, వెండి వస్తువులు 000.320.000 గ్రాములు వచ్చాయన్నారు. అన్న ప్రసాద వితరణ సత్రంలోని హుండీ ద్వారా మరో రూ.29,163,00లు వచ్చినట్లు తెలిపారు. కడప దేవదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ రమణమ్మ, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ సంఘాల నియామకం

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ సంఘాల కార్యవర్గాన్ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచి పలువురికి అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గాల్లో చోటు లభించింది. బద్వేలుకు చెందిన జగన్నాథం నాగేంద్రను రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, జమ్మలమడుగుకు చెందిన ఎం.రామకృష్ణ నాయక్‌ను ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, పులివెందులకు చెందిన ఎస్.మహేశ్వరిని ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా, బద్వేలుకు చెందిన కుప్పల వెంకట రమణను కల్చరల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, జమ్మలమడుగుకు చెందిన భూమిరెడ్డి దివాకర్‌రెడ్డిని కల్చరల్ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

- అన్నమయ్య జిల్లాలో రాజంపేట నియోజకవర్గానికి చెందిన గడికోట వెంకట సుబ్బారెడ్డిని రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శిగా, రాజంపేటకు చెందిన నాగేంద్ర నాయక్‌ను ఎస్టీ సెల్ కార్యదర్శిగా, పీలేరుకు చెందిన జి.అమర్‌నాథరెడ్డిని ప్రచార విభాగ ప్రధాన కార్యదర్శిగా, మదనపల్లెకు చెందిన కె.రత్నప్పను సాంస్కృతిక విభాగ సంయుక్త కార్యదర్శిగా, రాజంపేటకు చెందిన మోడెం నాగభూషణంను చేనేత విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

కలెక్టర్ చొరవతో సమస్య పరిష్కారం



కలెక్టర్ సమక్షంలో చేతులు కలిపిన ఐసీఎల్ ప్లాంట్ ప్రతినిధి, కార్మిక సంఘాల ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్/జమ్మలమడుగు: జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్లలోని ఇండియన్ సిమెంట్స్ లిమిటెడ్ (ఐసీఎల్) ప్లాంట్‌లో కార్మికులు, సంస్థ నిర్వహణ మధ్య ఇటీవల ఏర్పడిన సమస్య కలెక్టర్ డాక్టర్ శ్రీధర్‌చెరుకూరి చొరవతో పరిష్కారమైంది. ఎర్రగుంట్లలోని ఐసీఎల్‌లో రెండు ప్లాంట్ల మధ్య యాజమాన్యానికి, కార్మికులకు ఉన్న సమస్యల పరిష్కారానికి బుధవారం కలెక్టర్ ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. ఈ చర్చల్లో ఉభయ పక్షాలు కలసికట్టుగా పాల్గొని, పరస్పర అంగీకారంతో అన్ని సమస్యలను సఖ్యత పూర్వకంగా పరిష్కరించుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరిణామంతో ప్లాంట్‌లో నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయన్నారు. సంస్థ కార్యకలాపాలు ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకున్నాయని తెలిపారు.

రెడ్డెమ్మకు శృంగభంగం!

ప్రజలు మార్పు కోరారు. అదృష్టవశాత్తు ఎమ్మెల్యే అయ్యారు. అధికారం ఉంది. సద్వినియోగం చేసుకొని ప్రజల కోసం, ప్రాంతం కోసం ఉపయోగపడాలి. కాగా కడప గడపలో తద్భిన్నమైన శైలి తెరపైకి వచ్చింది. అడుగడుగునా నియంతృత్వం తోడైంది. తాను పట్టిన కుందేలికి మూడే కాళ్లు అనడం ఆరంభించారు. వ్యక్తిగత టార్గెట్ దిశగా అడుగులు వేశారు. కాదు, కూడదంటే స్వపక్షం, విపక్షం తేడా లేకుండా ముప్పుతిప్పలు పెట్టడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. వెరశి ఉన్నత న్యాయస్థానం జోక్యంతో శృంగభంగం తప్పలేదు.



- మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు కోసం విశ్వయత్నం
- అధికార దుర్వినియోగానికి చెంపపెట్టుగా నిలుస్తున్న హైకోర్టు తీర్పు
- సర్వ సభ్య సమావేశాం నిర్వహణకు అడ్డంకులు సృష్టిస్తున్న వైనం
- కమిషనర్ మనోజ్‌రెడ్డి ద్వారా అనేక కుయుక్తులు



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాతీర్పును ప్రజాస్వామ్యవాదులు గౌరవించాలి. హోదా, స్థాయికి అనుగుణంగా హుందాగా నడుచుకోవాలి. సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులకు నిత్యం తపన ఉండాలి. అవకాశం ఉన్నంతలో అభివృద్ధి కోసం విశేషంగా పాటు పడాలి. ఉన్నతమైన ప్రజాప్రతినిధుల్లో అలాంటి వైఖరి కన్పించనడ సహజం. కడపలో తద్భిన్నమైన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. లేని ప్రొటోకాల్ కోసం మంకు పట్టు పడుతున్నారు. మేయర్ స్థానానికి దీటుగా తనకు కుర్చీ ఉండాలంటూ భీష్మించుకున్నారు. అందుకోసం ఎందాకైనా సరే, అంటూ ఏకంగా అనర్హత వేటు దిశగా అడుగులు వేశారు. కుర్చీ కోసం పంతం పట్టిన కడప రెడ్డెమ్మలో అడుగడుగునా నియంతృత్వం తెరపైకి వచ్చింది. అందుకు ఏకపక్షంగా వ్యవహరించే అధికారులు తోడయ్యారు.

అధికారుల తప్పిదాన్ని మేయర్ సురేష్‌బాబుకు రుద్దారు. అంతే స్పీడుగా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష ఉత్తర్వులు వెల్లడించింది. ఈమొత్తం వ్యవహారాన్ని ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. అయినప్పటికీ కార్పొరేషన్ కేంద్రంగా చోటుచేసుకున్న వ్యవహారంలో ఎలాంటి మార్పు లేదు. శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించుకోగా, ఇప్పటికీ సమావేశం మందిరం తెరిచేందుకు కమిషనర్ మనోజ్‌రెడ్డి మనస్సు ఒప్పుకోవడం లేదు. మేయర్ సురేష్‌బాబు స్వయంగా కోరినా చలనం లేదు. అందుకు కారణం అనధికారికంగా ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యేలకు మేయర్ స్థానంలోనే సీట్లు ఏర్పాటు చేయడమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కొనసాగుతున్న వేధింపులు

కార్పొరేషన్ కేంద్రంగా కమిషనర్ మనోజ్ రెడ్డిని అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే మాధవీరెడ్డి వేధింపులు కొనసాగిస్తున్నారని పలువురు వెల్లడిస్తున్నారు. మేయర్ కోరినప్పటికీ సమావేశం మందిరాన్ని కూడా తెరవకుండా కమిషనర్ డొంకతిరుగుడు ధోరణితో వ్యవహరించడాన్ని ప్రజాస్వామ్యవాదులు తప్పుపడుతున్నారు. మరోవైపు జిల్లా యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోన్న ధోరణి నేపథ్యంలో కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశం నిర్వహణకు కూడా కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితిని నెలకొంది. సవ్యంగా సమావేశం కొనసాగించాలని, ప్రజాసమస్యలపై చర్చించాలని, అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయాలనే ఆలోచన అటు అధికారులకు, ఇటు అధికార పార్టీ నేతలకు లేకుండా పోయిందని పలువురు వివరిస్తున్నారు. ఇప్పటికైనా హుందాగా వ్యవహరించి సవ్యంగా సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

కుర్చీ చుట్టూనే వ్యవహారం....

కడప నగర పాలకమండలికి మేయర్ సుప్రీం. మేయర్ సీటు పైనుంటే ఎదురుగా కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు (ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు) వారికి కేటాయించిన స్థానాల్లో ఆశీనులు కావాల్సి ఉంది. అలా కాదు, అధికారంలో ఉన్నాం, మేయర్ సరసన నాకు సీటు ఉండాల్సిందేనని ఎమ్మెల్యేలు పట్టుబట్టడం అవివేకం. పైన కూర్చుంటే హోదా పెరగదు, ఎక్స్ అఫిషియో సభ్యులకు కేటాయించిన సీటులో కూర్చుంటే తరగదు. ఈ సత్యాన్ని విస్మరించి, ఇప్పటికీ రెండు పర్యాయాలు సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీరెడ్డి అడ్డు తగిలారు. మందీ మార్బలంతో కార్పొరేషన్ కార్యాలయంలోకి ప్రవేశించి హంగామా సృష్టించారు. అధికారం అండతో సమావేశాన్ని అడ్డుతగులుదామనే ఆలోచన కంటే, ప్రజాసమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుందామనే స్పృహ లేకుండా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇలాంటి చరిత్ర ఎప్పుడూ తెరపైకి రాలేదు. విచక్షణ మరిచి హుందాతనం కోల్పోతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జామ్ కౌన్సెలింగ్

- బదిలీల ప్రక్రియలో ఇబ్బందులు
- జూమ్ కాస్త జామ్ కౌన్సెలింగ్‌గా మారిన వైనం



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను జూమ్ కౌన్సెలింగ్ ద్వారా చేపడుతున్నారు. ఈ విధానం జామ్ కౌన్సెలింగ్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీల ప్రక్రియ బుధవారం నాటికి రెండోరోజుకు చేరింది. ఈ శాఖ పరిధిలో రాయలసీమ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం బదిలీలను చేపడుతున్నారు. ఆ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు జూమ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి వైఎస్సార్ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వచ్చారు.ఇక్కడ ఉద్యోగుల సౌకర్యార్థం ఒక సిస్టం ను కేటాయించారు. స్టాఫ్ నర్స్, ఎంపీ హెచ్ఎస్, ఎంపీహెచ్ఈఓ, హెచ్ఈఓ, డీపీఎంఓ, పీహెచ్ఎన్ (టీ), సీనియర్ అసిస్టెంట్స్ తదితర కేడర్లకు చెందిన ఉద్యోగులు కౌన్సెలింగ్ లో పాల్గొనాలి. కాగా ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం ఇతర సాంకేతిక కారణాలు తోడు కావడంతో సాయంత్రం అయినప్పటికీ అధిక సంఖ్యలో ఉద్యోగులు కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులు ప్రధానంగా మహిళా ఉద్యోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఉద్యోగుల సౌకర్యార్థం చేపడుతున్న జూమ్ కౌన్సిలింగ్ నత్త నడకన సాగుతూ జామ్ కౌన్సెలింగ్ గా మారిందని ఉద్యోగులు ఆరోపించారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ



సోలార్ రూఫ్ టాప్ పనిచేసే విధానాన్ని ఎస్ఈకి వివరిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. స్థానిక పవర్ హౌస్ రోడ్డులోని విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమణ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78వేలు రాయితీ ఇస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు పూర్తయిన తర్వాత సబ్సిడీ మొత్తం మీ బ్యాంకు ఖాతాకు 30 రోజుల్లో జమ అవుతుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అయ్యే మొత్తం వ్యయంపై 90 శాతం బ్యాంకులు ఎటువంటి పూచీకత్తు లేకుండా సిబిల్ రేటింగ్ బట్టి ఎటువంటి ప్రయాసలు లేకుండా ఒకే రోజు రుణం మంజూరు చేస్తారన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు 6.75 శాతం సబ్సిడీ వడ్డీ రేటుతో రుణాలు అందిస్తాయని, ఈ రుణం కేవలం ఐదేళ్లలో తీరిపోతుందని తెలిపారు. సోలార్ విద్యుత్‌ను మీరు వాడుకోగా మిగిలిన విద్యుత్‌కు యూనిట్ రూ.2.09 వంతున సంస్థ డబ్బులు చెల్లిస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకున్న సీవీ కొండప్ప, షఫివుల్లా మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుపై ఎలాంటి సమస్యలు లేవన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు తిరిష, వెంకటకృష్ణయ్య, హర్షవర్ధన్, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి, డీఈఈలు శ్రీనివాసులరెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





గండికోటలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, యోగాంధ్రలో పాల్గొన్న అధికారులు, ప్రజలు, విద్యార్థులు

కలెక్టర్ శ్రీధర్ చెరకూరి

జమ్మలమడుగు: యోగాతోనే సర్వమానవాళికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని , దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరకూరి పేర్కొన్నారు. బుధవారం యోగాంధ్ర మహోత్సవంలో భాగంగా మండలపరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో యోగా కార్యక్రమాన్ని ఐదువేల మందితో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఎందరో మునులు, రుషులు యోగులు తపోనిష్ఠ సమయంలో అనారోగ్యాలు దరి చేరకుండా యోగాసనాలు, ప్రాణాయామలు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని తమ సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు. చదువులు, ఇంట్లో పనులు ఆఫీసుల్లో ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారు. వీటన్నింటిన్ని జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అని అన్నారు. ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెన్–2025 నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రాచుర్యంలోనికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం డ్రగ్స్ నిర్మూళనపై ఈగల్ టీం ద్వార రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన పోస్టర్లను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, ఆర్డీఓ సాయిశ్రీ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ సభ్యుడు వరుణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పెద్ద స్కామ్

- టీడీపీ కార్యకర్తలకు దోచిపెడుతున్నారు
- అధికారంలోకి రాగానే విచారణ
- కడపలో టీడీపీ నేతల మామూళ్ల దందా
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటేమోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అనేక షరతులతో అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం వెనుక పెద్ద స్కామ్ నడుస్తోందని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా ఆరోపించారు. బుధవారం తన కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటేమోసం'అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్క ఆధార్ నంబరుతో వందల మంది టీడీపీ కార్యకర్తలకు తల్లికి వందనం డబ్బులు దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఒక కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి రూ. 15 వేలు చొప్పున సాయం అందిస్తామంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులు ఉండగా, అనేక షరతులు విధించి 31 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వకుండా కోత విధించారని పేర్కొన్నారు. ఈ పథకం కింద రూ.13 వేలు మాత్రమే అందజేస్తున్నారని, మిగతా మొత్తం మంత్రి నారా లోకేష్ జేబుల్లోకి వెళుతోందని తెలిపారు.

బాబు హామీల అమలు గాలికి

కడపలో టీడీపీ నేతలు ఏ ఒక్క వ్యాపారిని, డాక్టర్లను వదలకుండా మామూళ్ల దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ 143 అలవిగాని హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. వలంటీర్లకు పది వేల రూపాయల వేతనం ఇస్తామని నమ్మబలికి ఆ వ్యవస్థనే రద్దు చేశారన్నారు. నిరుద్యోగులకు రూ. 3 వేలు భృతి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ. 1500 చొప్పున సంవత్సరానికి రూ. 18 వేలు రావాల్సి ఉండగా, ఒక్క రూపాయి విదిల్చిన పాపాన పోలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇప్పటి వరకు కల్పించలేదన్నారు. మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అటకెక్కిందన్నారు. అమరావతి పేరుతో దోచుకుంటున్నారని చెప్పారు. విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై రూ. 15 వేల కోట్ల భారం మోపారన్నారు. ప్రతి ఏడాది ఇంటి పన్ను పెంచుతూనే ఉన్నారని తెలిపారు. కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు మొబలైజేషన్ అడ్వాన్స్ ఇస్తున్నారని తెలిపారు. ఏడాది కాలంలో 188 మంది మహిళలు అత్యాచారానికి గురయ్యారని, సాక్షాత్తు సీఎం నియోజకవర్గంలోనే మహిళలపై దాష్టీకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా హోం మంత్రి అనిత, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 3,33,000 కోట్ల రూపాయలు అప్పు చేసి సంక్షేమానికి ఖర్చు చేయగా, బాబు ఏడాది పాలనలోనే లక్షా 60 వేల కోట్లు అప్పు చేసి ఏ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించలేదని విమర్శించారు.

- ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నాయకులు పులి సునీల్‌కుమార్, షఫీ, యానాదయ్య, పాకా సురేష్, బసవరాజు,దాసరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబు హయాంలో విద్యారంగం కుదేలు: రామచంద్రారెడ్డి

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున 26 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారని తెలిపారు. పులివెందుల మెడికల్ కళాశాల పనులు 90 శాతం పూర్తి చేసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి వల్ల విద్యార్థులు సీట్లు కోల్పోయిన పరిస్థితి ఏర్పడటం విచారకరమన్నారు. తల్లికి వందనం పథకాన్ని అనేక షరతులు విధించారన్నారు. కర్నూలు జిల్లాలో ఒక్క ఆధార్ నంబరుతో 340 మందికి తల్లికి వందనం డబ్బులు ఇచ్చారంటే ఈ పథకం ఎంత అస్తవ్యస్తంగా కొనసాగుతుందో తెలుస్తోందన్నారు. బాబు హయాంలో విద్య, వైద్య రంగాలు కుదేలయ్యాయన్నారు. ఉద్యోగులకు ఇంత వరకు పీఆర్సీ లేకపోగా ఇవ్వాల్సిన నాలుగు డీఏలను పెండింగ్‌లో ఉంచడం బాధాకరమన్నారు.

రేపటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలిసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఏపీ పాలిసెట్‌లో పాల్గొనేందుకు ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా 1వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు ఈ నెల 21 నుంచి 27వ తేదీలోగా ఫీజు చెల్లించాలని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 250 చెల్లించాలని తెలిపారు. ర్యాంకుల వారీగా ధ్రువపత్రాల పరిశీలన ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు. పూర్తి వివరాలకు https://poliycet.ap.gov.in website ను చూడాలని సీహెచ్ జ్యోతి తెలిపారు.

క్లుప్తంగా

విషపురుగు కుట్టడంతో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో రామకృష్ణనగర్‌లో తమ ఇంటిలో కింద పడుకొని నిద్రపోతున్న వ్యక్తిని విషపురుగు కుట్టడంతో మృతిచెందాడు. వారి వివరాలు మేరకు.. ఆర్‌కె నగర్‌లోని శివ బండయ్య (35) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఇంట్లో కింద పడుకొని నిద్రపోతున్న సమయంలో విష పురుగు కుట్టి నట్లు తెలిపారు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహంను రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జల్సాల కోసం దొంగతనం

జమ్మలమడుగు : జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ఆగి ఉన్న లారీల నుంచి డీజిల్, పెట్రోల్ దొంగతనాలు చేస్తూ ముగ్గురు యువకులు పోలీసులకు చిక్కారు. బుధవారం ఎర్రగుంట్ల అర్బన్ సీఐ నరేస్‌బాబు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురం మండలం జంగంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పసల కిశోర్, పైడిపాళెంకు చెందిన గంగనపల్లి సిద్దయ్య, మూడే వంశీనాయక్‌లు కలిసి తిరగడం, తాగడం ప్రారంభించారు. సంపాదించిన డబ్బు అంతా వ్యసనాలకు ఖర్చు అవుతుండటంతో సులభంగా డబ్బు సంపాదించడం కోసం ఆగి ఉన్న లారీల ట్యాంకర్‌ల నుంచి డీజల్ దొంగతనాలతోపాటు డ్రైవర్‌లకు బెదిరించి వారి వద్ద డబ్బులను డిమాండ్ చేసేవారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం ముగ్గురు యువకులు మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న మోహన్‌రెడ్డి హెచ్‌పి పెట్రోల్ బంకు ముందర ఆగిఉన్న లారీ నుంచి డీజల్ తీస్తున్న క్రమంలో ఆ లారీ ఓనర్ అయిన దస్తగిరి చూసి ఏమిచేస్తున్నారు అంటూ గట్టిగా అరవడంతో ముగ్గురూ వారి వెంట తెచ్చుకున్న కత్తిని ఓనర్ గొంతుపై పెట్టి అరిస్తే చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అతని వద్ద నుంచి 2500 రూపాయల నగదు తీసుకుపోయారన్నారు. దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టామని.. మంగళవారం సాయంత్రం ముద్దనూరు మండలంలోని కె.తిమ్మాపురం వద్ద ఉన్న చిత్రలేఖ డాబా వద్ద అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. వీరి వద్ద నుంచి 120 లీటర్ల డీజల్, రూ. 2500 నగదు, ఒక స్కూటర్, ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు జీవిత ఖైదీలు విడుదల



కడప కేంద్ర కారాగారం నుంచి విడుదలైన జీవితఖైదీలకు సూచనలు చేస్తున్న అధికారులు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో జీవితఖైదును అనుభవిస్తున్న ఖైదీలలో సత్ప్రవర్తన కలిగిన వారి జాబితాలో 17 మందిని విడుదల చేయాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదీ శిక్ష అనుభవిస్తున్న వారిలో 16 మంది జాబితాను అధికారులు పంపించారు. ఈ జాబితాలో కడప కేంద్ర కారాగారం నుంచి కేవలం నలుగురిని విడుదల చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. వీరిలో జీవితఖైదు అనుభవిస్తున్న సయ్యద్ రౌఫ్ అలియాస్ రాజు, హరిత విజయ్ కుమార్, పాయిని అలియాస్ పలాని, బల్ల వసంత కుమార్ అలియాస్ వసంత విడుదలయ్యారు. ఏళ్ల తరబడి జైల్లో శిక్ష అనుభవిస్తూ ఒక్కసారిగా విడుదల కావడంతో వారు ఆనందంతో మునిగిపోయారు. జీవితంలో ఎలాంటి తప్పులు చేయరాదనీ, తమ కుటుంబసభ్యులకు, స్నేహితులకు చెబుతామనీ వారు తెలియజేశారు. కడప కేంద్ర కారాగారం నుంచి నలుగురు జీవితఖైదీల వివరాలను పర్యవేక్షించినవారిలో సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు కమలాకర్, రమేష్ ఉన్నారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

- చేనుకు చేవ.. రైతులకు రొక్కం
- పచ్చిరొట్ట సాగుకు ఇదే అదును
- నేలలో ఉష్ణోగ్రత సమతుల్యతకు దోహదం
- జిల్లాలో ప్రారంభమైన వర్షాలు
- జిల్లాకు 4,567 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపు



జనుముపంట



జీలుగపంట



పెసరపంట

కడప అగ్రికల్చర్ : నైరుతీ రుతు పవనాలు జిల్లాను తాకాయి. జిల్లావ్యాప్తంగా వర్షాలు కూడా ప్రారంభమయ్యాయి. దీంతోపాటు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1,28,084 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా ఉండగా.. ఇందులో 30,804 హెక్టార్లలో సాధారణ వరిపంట సాగుకానుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. కానీ అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోనే వరిపంట సాగుకానుంది. ఇందులో ముఖ్యంగా కేసీ కెనాల్‌తోపాటు కుందు, పెన్నా పరివాహక ప్రాంతంతోపాటు చెరువులు, బోర్ల కింద చాలామంది రైతులు వరిపంటను సాగు చేయనున్నారు. ఈ మేరకు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుము, పిల్లపెసలను సబ్సిడీపై జిల్లాకు 4567 క్వింటాళ్లను అధికారులు కేటాయించారు. సంబంధిత విత్తనాలను రైతు సేవాకేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ క్రమంలో వాతావరణ అనుకూలతను ఆసరాగా చేసుకుని రైతన్నలు పచ్చిరొట్ట సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే పచ్చిరొట్ట పూత దశకు చేరుకుంటుంది. వరినాట్లు వేసే సమయానికి ఈ పంట అదునుకు వస్తుందని తెలుపుతున్నారు. ప్రస్తుతం రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా పెరగడంతో భూమి నుంచి పైరుకు అవసరమైన పోషకాలు లభించడం లేదని, వీటి సాగు వల్ల భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల్లో కోతే..

రైతులు ప్రధాన పంటల సాగుకు ముందు సత్తువ పంటలైన జీలుగ, జనుము, పెసర పంటలను సాగు చేస్తారు. అయితే జిల్లాకు జీలుగలు, జనుములు,పెసలు కేటాయింపులోనూ కూటమి ప్రభుత్వం కోత విధించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాకు జీలుగలను 4780 క్వింటాళ్లు కేటాయిస్తే , కూటమి ప్రభుత్వం కేవలం 1537 క్వింటాళ్ల మాత్రమే కేటాయించింది. అలాగే జనుములకు సంబంధించి గత ప్రభుత్వం 463 క్వింటాళ్ల కేటాయిస్తే కూటమి ప్రభుత్వం మాత్రం 2982 క్వింటాళ్లను కేటాయించారు. అలాగే పెసలకు సంబంధించి గత ప్రభుత్వంలో 80 క్వింటాళ్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వం మాత్రం 48 క్వింటాళ్లను కేటాయించారు. పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపుల్లోను కోత విధించడంపై రైతులు, రైతు సంఘ నాయకులు ఆసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని నది పరివాహక ప్రాంతమైన ఒంటిమిట్ట మండలంలోనే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభించారు. మిగతా ఎక్కడా కూడా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభించలేదు. పచ్చిరొట్టకు సంబంధించిన విత్తనాలు ఇంకా రావాల్సి ఉంది.

ప్రయోజనాలు మెండు..

నేలతల్లి ఒడిలో విత్తిన విత్తు ఆరోగ్యంగా ఎదిగి అధిక ఫలసాయం రావాలంటే భూమిలో సారం పెంచడంలో పచ్చిరొట్ట పైర్లు ఎంతో కీలక ప్రాత పోషిస్తాయి. పచ్చిరొట్ట పైరులైన జీలుగ, జనుము, పిల్లపెసర వంటి వాటిని సాగు చేయటం వల్ల నేల స్థితిలో మంచి మార్పు వస్తుంది. చేనుకు చేవతోపాటు అన్నదాత అధిక లాభాలు పొందవచ్చు. అలాగే రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుంది. నిస్సారమైన పొలంలో సారం పెరుగుతుంది. చౌడు నేలలను సాధారణ స్థితికి తీసుకురావచ్చు. దీంతోపాటు పశువుల మేత సమస్య రాకుండా పశుగ్రాసాలు ఉపయోగపడతాయి. అంతేకాకుండా భూమిలో కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. దీంతోపాటు మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు మెండుగా లభిస్తాయి. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గుతుంది. రసాయన ఎరువులు భూమి అంతర పొరలకు చేరి పోకుండా అడ్డుకట్టు వేయవచ్చు. అలాగే భూ అంతర్ పొరల్లో ఉష్ణోగ్రత సమతుల్యతను కాపాడుతుంది.

ఈ ఏడాది కేటాయించిన సబ్సిడీ విత్తనాలు..		
విత్తనాలు	మంజూరైన క్వింటాళ్లు	సబ్సిడీ
జీలుగలు	1537	50
జనుములు	2982	50
పిల్లపెసలు	48	50

గతేడాది జిల్లాకు కేటాయించిన సబ్సిడీ విత్తనాల వివరాలు ఇలా..		
విత్తనాలు	మంజూరైనవి (క్వింటాళు)	సబ్సిడీ
జీలుగలు	4780	50 శాతం
జనుములు	463	50 శాతం
పిల్లపెసలు	80	50 శాతం

పూతదశ రాకమునుపే..

రైతన్నలు సాగు చేసిన జనుము, జీలుగ, పిల్లిపెసర పూతదశ రాకమునుపే భూమిలో కలియదున్నాలి. ఇలా చేస్తే నిర్జీవమైన పుడమివడి తిరిగి జీవం పోసుకుంటుంది. నేలలో భౌతిక గుణాలు బాగా వృద్ధి చెందుతాయి. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. అలాగే సమస్యాత్మక భూములు కూడా పచ్చిరొట్టతో బయటపడతాయి.

జీలుగ..

ఎకరా జీలుగ సాగుకు 12 నుంచి 16 కిలోల విత్తనం అవసరం. ఈ పైరు ద్వారా 6 నుంచి 8 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. దీనిని పొలంలో దున్నడం వల్ల నత్రజని- 30, బాస్వరం-8, పొటాషియం -25 కిలోలు పొందవచ్చు. దీనిని మాగాణి భూముల్లో సాగు చేసుకుంటే మంచిది.

జనుము..

ఎకరా జనుము సాగుకు 20 కిలోల విత్తనం కావాలి. పచ్చిరొట్ట 4 నుంచి 6 టన్నులు వస్తుంది. నత్రజని -40, బాస్వరం-6, పొటాషియం 20 కిలోలు వస్తుంది. పూత రాకమునుపే భూమిలో కలియదున్నాలి.

పిల్లపెసర..

ఎకరా పిల్లపెసల సాగుకు 6 నుంచి 8 కిలోలు చల్లుకోవాలి. పంటకోత దశలో దున్నకాలు చేసుకుంటే 2 నుంచి 3 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. దీని ద్వారా నత్రజని 18, భాస్వరం 2.5, పొటాషియం -13 కిలోలు వస్తుంది.

పచ్చి రొట్ట వలన లాభాలు..

పచ్చరొట్ట పైర్లు సాగు చేసిన రైతులు 40 నుంచి 50 రోజుల తర్వాత దున్నుకోవాలి. భూమికి తగినంత సేంద్రియ పదార్థం అందుతుంది. లెగ్యూమ్ జాతి పచ్చిరొట్ట పంటలు గాలిలోని నత్రజనిని బుడిపెల రూపంలో సేకరించి పొలంలో కలియ దున్నడంతో భూసారాన్ని పెంచుతాయి. నేలలో తమను నిలుపుకునే శక్తి, గాలి ప్రసరణ, నీరు ఇంకే గుణం పెంపొందుతుంది. రొట్ట కుళ్లినప్పుడు విడుదలయ్యే ఆమ్లాల ద్వారా నేల క్షారత తగ్గుతుంది. నేలలోని భాస్వరం ఎక్కువగా మొక్కలకు అందుబాటులోకి వస్తుంది. సూక్ష్మ ధాతువులైన ఇనుము, జింకు, మాంగనీసు లోపాలను అధిక ఉష్ణోగ్రతలను నియంత్రిచవచ్చు. వరిపంటను సాగు చేసే ప్రతి రైతు తప్పకుండా పచ్చరొట్ట పంటలను సాగు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారి పల్లి గ్రామం, చాకలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు (38) మంగళవారం వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ రవీంద్ర బాబు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు చాగలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు భార్య, పిల్లలతో కలిసి బెంగుళూరులో జీవనం సాగిస్తూ ఉండేవారు. ఈ మధ్యకాలంలో స్వగ్రామమైన చాగలగుట్టపల్లికి కుటుంబంతో కలిసి వచ్చారు. రామాంజనేయులు తన భార్య తనతో మాట్లాడటం లేదనే నెపంతో ఇంట్లో ఉన్న వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు హుటాహుటిన రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రామాంజనేయులు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు అరెస్ట్



అడవి పంది మాంసం, నిందితులను చూపుతున్న అటవీ అధికారులు

వీరబల్లి : మండలంలోని సానిపాయి ఫారెస్టు బీట్‌లోని ఎర్రచేను ప్రదేశంలో అడవి పందులను చంపి మాంసం తీసుకెళ్తున్న ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజ్ ఫారెస్టు ఆఫీసర్ వైసీ రెడ్డి తెలిపారు. రహస్య సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అడవి పంది మాంసం తీసుకెళుతున్న నక్క నాగరాజు, జగన్నాథం అనే ఇద్దరిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఉత్తరప్రదేశ్ వాసి ఆత్మహత్య



రాంశంకర్ మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక డీసీఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న రాంశంకర్ (24) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని షాజాహాన్‌పూర్ జిల్లా, బిజిరాపూర్‌కు చెందిన రాంశంకర్ కొన్నేళ్ల నుంచి ప్రొద్దుటూరులో ఉంటున్నాడు. అతను బండిపై వేరుశనక్కాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. 8 నెలల క్రితం పింకి అనే మహిళతో అతనికి వివాహమైంది. రాంశంకర్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి వ్యాపారానికి వెళ్లేవాడు కాదు. ఈ క్రమంలో రోజు మద్యం తాగితే ఎలా అని భార్య, సోదరుడు రాంశంకర్‌ను ప్రశ్నించారు. దీంతో మద్యం మత్తులో ఉన్న అతను బుధవారం డీసీఎస్సార్ కాలనీలోని ఒక స్కూల్ సమీపంలో ఉన్న చెట్టుకు చున్నీ చుట్టుకొని ఉరేసుకున్నాడు. టూ టౌన్ ఎస్‌ఐ ధనుంజయ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య పింకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నివర్గాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, నాయకులు

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో అన్ని వర్గాలను మోసం చేసిందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'జగనన్న అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పడంతోపాటు 143 హామీలను ఇచ్చారు. ఏడాది కాలమైనా పథకాలు అమలు చేయలేక ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఇటీవల తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాలలో డబ్బులు కూడా సక్రమంగా జమకావడంలేదని లబ్ధిదారులు వాపోతున్న సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు 1500 రూపాయలు, నిరుద్యోగ భృతికింద మూడువేల రూపాయలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులతో, మహిళలతో ఓట్లు వేయించుకుని ఏడాది అవుతున్నా ఆ పథకాలు అమలు ఊసేలేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సంపద సృష్టించి ప్రజల ఖాతాలలో వేస్తామంటున్నారు. సంపద సృష్టించడం ఏమోకాని భారీగా అప్పులు చేస్తూ ఆ భారం ప్రజల నెత్తిన పెడుతున్నారన్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను తీసుకు వచ్చి నెల నెలా కేలండర్ పెట్టి ప్రజల ఖాతాలలో డబ్బులు జమ చేసిన చరిత్ర ఉందన్నారు. కానీ నేడు సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలవుతాయో అన్న విషయంపై కూటమి ప్రభుత్వానికే స్పష్టత లేదన్నారు. ఏడాది కాలంలో దళితులపైన దాడులు, చిన్నారులపై, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయి వారికి కనీస భద్రత కూడా కరువైపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, పెద్దముడియం మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్షుమయ్య, ఎస్సీ సెల్ కార్యదర్శి యోబు, సుబ్రమణ్యం, రాఘవేంద్ర, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్ హత్యకేసులో వీడిన మిస్టరీ

- అనుమానించినట్లుగానే భర్తను కడతేర్చిన భార్య
- అక్రమ సంబంధాలు, వేధింపులు, బ్లాక్ మెయిల్ భరించలేక హత్య
- భార్యతో పాటు ఇద్దరు నిందితుల అరెస్ట్
- హత్య కేసులో నిందితురాలుగా కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ..?
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మీడియా సమావేశంలో హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మదనపల్లె రూరల్ : పట్టణంలో సంచలనం సృష్టించిన రియల్టర్ గంగాధర హత్యకేసు మిస్టరీ వీడింది. ముందు నుంచీ ఊహించినట్లుగా, గంగాధర హత్యకేసులో ప్రధాన సూత్రధారిగా భార్య వనిత ఉందనే అనుమానం నిజమైంది. హత్య జరిగిన తర్వాత పోలీసు విచారణలో పొంతన లేని సమాధానాలు చెప్పడంతో భార్య వనితను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెను విచారించారు. దీంతో హత్యకేసుకు సంబంధించిన వాస్తవాలను వనిత బయటపెట్టింది. కొరియర్ బాయ్ రెడ్డిరాము, ఆటో డ్రైవర్ గంజి మహేష్‌బాబు సహాయంతో భర్తను కడతేర్చినట్లు నేరం అంగీకరించింది. దీంతో నిందితులకు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం రాయచోటిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో హత్యకు దారితీసిన పరిస్థితులను వెల్లడిస్తూ, ముగ్గురు నిందితులను అరెస్ట్ చూపారు. వివరాలు.. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ నక్కలకుంట సమీపంలో నివాసం ఉంటున్న కృష్ణమూర్తి, నారాయణమ్మ కుమారుడు నారప్పగారి గంగాధర(37) స్థానికంగా రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తుండేవాడు. ఈనెల 15వ తేదీ ఆదివారం రాత్రి గంగాధర నివాసంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హాల్లో పడుకుని ఉన్న అతడిపై రాళ్లతో దాడిచేసి కొట్టి చంపేసినట్లు భార్య వనిత పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో తాలూకా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, గంగాధర ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. 16వ తేదీ సోమవారం ఉదయం మృతుడు గంగాధర తమ్ముడు నారప్పగారి వెంకటేష్ తన అన్న మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ గంగాధర భార్య వనితతో పాటుగా మరి కొంత మంది ప్రమేయం ఉండవచ్చని ఫిర్యాదుచేశాడు. దీంతో తాలూకా పోలీసులు వనితను అదుపులోకి తీసుకుని విచారించగా...2012లో గంగాధరతో తనకు వివాహం జరిగిందని, కుమార్తె హిమప్రియ, కుమారుడు మోక్షిత్ ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపింది. భర్త గంగాధర రియల్‌ఎస్టేట్, వడ్డీవ్యాపారాలు చేస్తూ, పలువురు మహిళలతో అక్రమసంబంధాలు పెట్టుకుని, వారికి డబ్బులు అప్పుగా ఇచ్చి, వారికి తెలియకుండా న్యూడ్ వీడియోలు, ఫోటోలను సెల్‌ఫోన్‌లో తీసుకుని, తర్వాత వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ వశపరచుకునేవాడన్నారు. అదేవిధంగా భార్యనైన తనను శారీరకంగా, మానసికంగా హింసించేవాడని తెలిపింది. దీంతో అతడి వేధింపులు భరించలేక, అతడిపై కక్ష పెంచుకుని ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకుంది. హత్యచేసేందుకు పరిచయస్థులైన...కే.వి. పల్లె మండలం తీతవ వడ్డిపల్లెకు చెందిన సొదుం రెడ్డి రాము(36), మదనపల్లె పట్టణం ఎస్టేట్ ప్రాంతం పద్మావతి కల్యాణమండపం వద్ద నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ గంజి మహేష్‌బాబు(20) సాయం తీసుకుంది. భర్త గంగాధర ఇంటికి రాగా, అతడికి ఆహారంలో నిద్రమాత్రలు కలిపి పెట్టింది. అనంతరం ఇంటి హాలులో ఆదమరచి నిద్రిస్తుండగా, భార్య వనిత మరో ఇద్దరు నిందితులతో కలిసి తలపై బండరాయితో కొట్టి హతమార్చారు. కేసులో నిందితులను మదనపల్లె మండలం ఎర్రగానిమిట్ట టిడ్కో గృహాల సమీపంలో అరెస్ట్‌చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, కేసును చేధించిన మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐ కళావెంకటరమణ, పోలీసు సిబ్బందిని అభినందించారు.

హత్యలో కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గంగాదేవి..

రియల్టర్ గంగాధర హత్యకేసులో భార్య వనిత, ఇద్దరు నిందితులతో పాటుగా కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న గంగాదేవి ఉన్నట్లు సమాచారం. బుధవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో హత్యకేసులో నిందితులైన వనిత, రెడ్డిరామ్, మహేష్‌లతో పాటు ప్రభుత్వ వైద్యురాలు గంగాదేవికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని రాయచోటి జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలించారు. వైద్యపరీక్షల నిర్వహణలో భాగంగా వైద్యురాలు గంగాదేవిని కేసులో ఏ–3గా పేర్కొన్నారు. గంగాధరను చంపేందుకు భార్య వనితకు నిద్రమాత్రలను గంగాదేవి సమకూర్చడంతో పాటు, హత్య తర్వాత అతను చనిపోయాడా లేదా అనేది నిర్ధారించడంలో సహాయపడినట్లు తెలుస్తోంది. అయితే గంగాదేవిని హత్యకేసుకు సంబంధించి మీడియా సమావేశంలో అరెస్ట్ చూపకపోవడం, ఆమె పాత్రపై వివరాలు వెల్లడించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణలో అదుపులోకి తీసుకుని, వైద్యపరీక్షలు సైతం నిర్వహించి ఎందుకు పోలీసులు అరెస్ట్ చూపలేదన్నది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం ఉప్పరపల్లె సమీపంలో ప్రభుత్వ భూమిని టీడీపీకి చెందిన మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి దర్జాగా కబ్జా చేస్తున్నారు. సర్వే నెంబర్ 507లో ప్రభుత్వ జాగా ఉంది. గత మూడు రోజులుగా జేసీబీలు పెట్టి పనిచేయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ ప్రభుత్వం బోర్డును ఏర్పాటు చేసి ఇది ప్రభుత్వ భూమి.. ఇందులో ఎవరూ ప్రవేశించరాదని, ప్రవేశించిన వారిపై కఠినచర్యలు తప్పవని సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అయినా సూచికబోర్డును సైతం లెక్క చేయకుండా మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి యథేచ్ఛగా భూమిని చదును చేసి ఆక్రమణ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

రాయచోటి : మండల పరిధిలోని గుట్టపల్లె గ్రామంలో భూ ఆక్రమణపై గ్రామస్తులు తహసీల్దార్, పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారి వివరాల మేరకు.. గుట్టపల్లె గ్రామంలోని 202, 203, 207 సర్వే నెంబర్ల కు సంబంధించి భూమిని దాదాపు 20 మంది రైతులకు అసైన్‌మెంట్ కింద అధికారులు ధ్రువపత్రాలను అందించారని లబ్ధిదారులు తెలిపారు. అయితే బట్టా వాండ్లపల్లెకు చెందిన ఓ మహిళకు అడవికమ్మపల్లె సమీపంలో పొలం ఉన్నప్పటికీ ఎస్.సోమవరం గ్రామంలోని టీడీపీ నాయకుని అండతో సదరు సర్వే నంబర్లలో అక్రమంగా భూమిలో బోరు వేసి, చెట్లను నాటుతోందని లబ్ధిదారులు బుధవారం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్‌ఐ భక్త వత్సలంకు ఫిర్యాదు చేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిద్ధవటం : సిద్ధవటం పరిసర గ్రామాల ప్రజలకు వైరల్ ఫీవర్స్ వస్తున్నాయని సిద్ధవటం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ వైరల్ ఫీవర్స్ వాతావరణంలో మార్పుల వల్ల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించక పోవడం వలన, తాగునీటి అపరిశుభ్రత తోనే వైరల్ ఫీవర్‌లు వస్తున్నాయన్నారు. జ్వరాలతో పాటు కడుపు నొప్పి, వాంతులతో కూడా జ్వరాలు వస్తున్నాయని, ఎవరైనా జ్వరాలు వస్తే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. బుధవారం కూడా కొత్తమాధవరం, వంతాటిపల్లె పి. కొత్తపల్లి, సిద్ధవటం ఎగువపేట, జంగాలపల్లె గ్రామాల నుంచి జ్వరంతో వచ్చారని వారిని పరీక్షించి వైద్యం అందించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు

కడప అర్బన్ : ప్రొద్దుటూరులో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ బెట్టింగ్ జోరు కొనసాగుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న నిర్వాహకుల నుంచి మామూళ్లను వసూళ్లు చేస్తున్నారంటూ రాజ్‌కుమార్, సిద్దారెడ్డి అనే కానిస్టేబుళ్లను ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బుధవారం వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.